


# ఘోషం

'అనంత'

యథాప్రకారం పక్కింటి మంగమ్మగారి సుప్రభాతంతో మెలకువ వచ్చింది. సెలవు కావడం వల్ల లేచి చేసేదేమీ లేకపోవడంతో, పడుకుని వింటున్నాను.

మొదట్లో విసుగ్గా ఉండేది కానీ, రాను రానూ అలవాటైపోయింది. ఇప్పుడది మా దినచర్యలో భాగం. తెల్లవారకముందే లేచేవాళ్లు. ఎంతటి మహాపట్నంలోనూ పక్షుల కలకలారావాలు వినటానికి అలవాటు పడిపోయినట్లే మా కుటుంబ సభ్యులమంతా 'మంగ'ళ వాయిద్యాలని వినటానికి అలవాటు పడిపోయాం. ఆవిడ ఎప్పుడైనా ఊరెళ్లి ఒకరోజు ఉదయ ప్రసారాలు లేకపోతే మాకు తెల్లవారినట్టే అనిపించదు. కానీ, మా ఇంట్లోకి అద్దెకి వచ్చినవాళ్లెవరూ ఈ రకమైన సంరంభానికి అలవాటు పడలేకపోయారు. అందుకే అన్ని సౌకర్యాలూ ఉన్నా, మా ఇంట్లో ఎవరూ ఆరు నెలలకన్నా ఉండటం లేదు. వెడుతూ వెడుతూ, మాకు 'సహనశ్రీ', 'సహనరత్న'లాంటి బిరుదాలిచ్చి మరీ వెళ్లారు.

అలా అద్దెకున్నవాళ్లు వెళ్లిపోతున్నప్పుడు మాత్రం, ఈ ఇంటి గురించి మేము విన్నది వదంతి కాదు, నిజమేమో అనిపిస్తుంది. మంచి లొకాలిటీలో, అంత చౌకగా ఇల్లు దొరికిందని మేము సంతోషపడుతుంటే, మా కొలీగ్ ఒకడు చెప్పాడు "ఆ ఇంటివాళ్లు పక్కింటి మంగమ్మగారి పోరు పడలేక అయినకాడికి తెగనమ్ముకుంటున్నారు!" అని. పైగా, "ఆవిడ బాధలెలా పడతావు?" అని జాలి కూడా ప్రదర్శించారు. సౌకగా ఇల్లు కొంటున్నానన్న అసూయతో, అలా భయపెట్టాడనుకున్నాను. లేకపోతే, పక్కింటివాళ్లేమిటి? మమ్మల్ని బాధపెట్టడమేమిటి? 'అబ్సర్డ్' అనుకున్నాను.

కానీ, ఈ ఏడేళ్ల అనుభవంలో నా అభిప్రాయం తప్పని ఋజువైంది. పిల్లలందరూ పెద్దవాళ్లయి తలొకచోటా ఉండటం వల్ల, వచ్చినప్పుడు కూడా తగాదాలకి పోనివాళ్లు కావటంవల్ల ఇన్నాళ్లూ, ఆవిడ నోరు యధేచ్ఛగా రాజ్యం చేసింది. వినాయక చవితి ఉత్సవాలప్పుడు, ఎన్నికలప్పుడూ, పెళ్లిళ్ల సీజన్లలోనూ లౌడ్‌స్పీకర్‌లో వినవచ్చే చౌకబారు పాటలు బలవంతంగా వినటానికి అలవాటుపడ్డవాళ్లం కదా! ఇదెంత?

వానకి తడవనివాళ్లూ, మంగమ్మగారిచేత చివాట్లు తిననివాళ్లూ ఉండరు. ఆవిడచేత అక్షింతలు వేయించుకునే భాగ్యం ఏ రోజు ఎవరికి పడుతుందో చెప్పలేము. పనిమనిషి రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చి ఉండవచ్చు. పాలల్లో నీళ్లు రూజో కన్నా ఎక్కువ కలిశాయన్న అనుమానం కలిగి ఉండవచ్చు. ఏ కొంటె కుర్రవాడో జామపిందె కోసి ఉండవచ్చు. వంటింటి తలుపులు తీసి ఉంటే ఏ కాకో, పిల్లో వచ్చి చెమ్చానో, నేతి గిన్నెనో నోట కరుచుకుని ఉండవచ్చును. ఆవడ ఉదయప్రసారాలకి కావాల్సినంత ఆహారం. ఏమీ లేకపోతే తనే పాలు పొంగబెట్టి ఉండవచ్చు.

అప్పుడప్పుడూ ఆ లక్ష్యం మా కుటుంబ సభ్యులో, అద్దెకున్నవాళ్లో కూడా అవుతూంటాం. కానీ చేసేదేముంది? ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుండి వార్తలు చదువుతున్న 'మంగమ్మ'గారితో. ఏం మాట్లాడగలం, వినటం తప్ప! ఈ మంగమ్మగారి

సంగతీ అంతే!

అయితే ఈమధ్య ఆవిడ ధోరణి మరీ విపరీతంగా ఉంది. మా కొబ్బరి మట్ట, తన గోడమీదకి త్వరలో వాలబోతోంది అని పదిహేను రోజుల క్రితం కొట్టించింది. అంతకు ముందు ఒక వారంరోజులపాటు ఆవిడ మాటల్లో విషయం అదే.

ఇప్పుడొక వారం రోజులుగా విషయం మారింది. దానికి కారణం, సెలవలకని వచ్చిన మా మనవడు ప్రహరీ గోడమీదుగా మా పెరట్లోకి వంగిన ఆవిడ దానిమ్మ చెట్టునుంచి ఒక పింద కోశాడు అది ఆవిడ చూడనే చూసింది. ఇంకేముందీ? ఇటు ఏడు తరాలు నెయ్యబడ్డారు. ఆ దూకుడు మావీదేనని, లక్ష్యాలమ మేమేనని అర్థం కావటానికి కొంత సమయం పట్టింది అది కూడా మా శంకూ చెపితేనే.

"ఇవ్వాళ దానిమ్మ పిందె అయింది. కళ్లపడింది కనక తెలిసింది. ఇంతకుముందెన్నో? ఇహ ఇంకా ఎన్నో? ఆ వంశమే అంత ...."

ఆగకుండా సాగుతున్న ఆ వాగ్ధోరణి వింటున్న వా శంకు "అది నా గురించే తాతగారూ! నేనే దానిమ్మ పింద కోసింది. ఒక్క పిందకే అలా తిడుతుందేవిటి ఆవిడ?" అన్నాడు.

"అది వాళ్ల చెట్టు కదా! అందుకని. మనది కానిది తీసుకుంటే దొంగతనమే అవుతుంది కదా!" అన్నాను నేను.

"నేను అలా అనుకోలేదు. అంత చిన్న పింద తినటానికి కొయ్యలేదు. ఆడుకోటానికి కోశాను. అయినా, సారీ చెప్పేస్తాను ఆవిడకి!" అంటూ తూనీలాగా దూసుకునిపోయాడు నేను ఆగమని చెప్తున్నా వినకుండా.

"ఏం నాయనా? ఇంకా ఏం పట్టుకుపోదామని వచ్చావూ?" అంటున్న మంగమ్మగారి మాటలు వినిపించాయి.

"దానిమ్మ పింద కోశాను కదా! పొరపాటైందని సారీ చెప్పటానికి వచ్చాను, బామ్మగారూ!" అని మా శంకూ పరిగెత్తుకుని రావటం, మంగమ్మగారి నోటి స్విచ్చిని ఆన్ చేసినట్లయింది. సుమారొక గంట ఇష్టమొచ్చిన రీతిలో మంద్ర, తారాస్థాయిల్లో సాగిపోయింది ఆవిడ వాగ్ధాటి.

మర్నాటి నుంచి చిలకలు కొట్టిన జామకాయలు మా పెరట్లో పడితే, తన చెట్టు కాయలు తనని అడగకుండానే, మా ఇంట్లో అద్దెకున్నవాళ్ల పిల్లలు తింటున్నారు కనుక, వాళ్లంతా దొంగలని దుమ్మెత్తిపోయటం ప్రారంభించింది. దానితో, మా శంకూ కోసిన దానిమ్మ పింద సంగతి అడుగున పడిపోయింది. మా ఇంట్లో అద్దెకున్న వాళ్లకి ఇద్దరూ ఆడపిల్లలు. చిన్నవాళ్లు చిన్నవాళ్లు. జామకాయ పక్కింటి వాళ్ల చెట్టుది. తినకూడదు అన్నంత ఊహ వచ్చే వయసు కాదు. శంకూకి పదేళ్లు. వాళ్లని బాగా ముద్దు చేస్తాడు. నిన్నటిరోజు వాళ్లని తిడుతుంటే, ఊరుకోక పెరటి గోడమీదకెక్కి,

"వాళ్లు కొయ్యలేదు కదండీ బామ్మగారూ! మా పెరట్లో పడినవి చిలకలు కొరికినవే కదా! పాపం, చిన్నపిల్లలు .... తిట్టకండి!" అన్నాడు.

ఇంతవరకు ఆవిడ నోరెత్తితే జవాబిచ్చిన వాళ్లు లేరు. వేలెడు గుంటడు ఇలా అంటే ఆవిడ అహానికెంత దెబ్బ? దానితో మరీ విజృంభించింది. నేను శంకూని లోపలికి పిలిచాను. వాడు లోపలికి వచ్చి నాతో వాదించడం మొదలుపెట్టాడు.

"మన కొబ్బరిమట్ట వాళ్ల గోడమీదకి వాలిందని కొట్టించింది కదా! మన పెరట్లోకి వచ్చిన ఆవిడ చెట్టు కొమ్మలని మనం కొట్టించకూడదా? అప్పుడు ఇలాంటి తగాదాలు రావు కదా!" అంటూ వాదించిన వాడి మాటలు పైకి హేతుబద్ధంగానే కనిపించాయి కానీ, ఎవరిదైతే నేం? పచ్చని చెట్టుని కొట్టించటం పాపమన్న నా సిద్ధాంతం వాడికి అర్థమయ్యేటట్లు చెప్పలేకపోయాను. పనిమనిషి రాలేదని విసుక్కుని, పెరడు తుడుస్తున్న వా ఆవిడ సణుగుడికి తాళం వేస్తున్న ఆకుల గలగల వింటూ మౌనంగా ఉండిపోయాను. "వాళ్ల చెట్ల ఆకులన్నీ బామ్మ తుడవాలి, పాపం! కాస్త సాయం చేస్తాను!" అంటూ లేచి వెళ్లాడు శంకూ.

నిన్నటి సంగతి గుర్తుకురాగానే మత్తు ఎగిరిపోయింది. మంగమ్మగారి కోపానికి ఎర మా శంకూ కాదు కదా! అనిపించి చటుక్కున మంచం మీంచి లేచి, పెరట్లోకి వెళ్లాను. అక్కడి దబుశ్యం అపురూపం. మా ఆవిడ తెల్లబోయే బొమ్మలా నిలబడి ఉంది. శంకూ పెద్ద హీరోలాగా నిలబడి ఉన్నాడు. మా ఇంట్లో అద్దెకున్న వాళ్ల కుటుంబం, చిన్నపిల్లలతో సహా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయారు. ఎప్పుడూ లేనిది, చుట్టుపక్కల ఇళ్లల్లో వాళ్లు కూడా వినోదం చూస్తున్నారు. మంగమ్మగారి అరుపుల్లో పూర్వం ఉండే నిరంకుశత్వంతోపాటు న్యాయంకోసం, సానుభూతికోసం అర్థింపు ఉంది.

మా దూకుడుపిండం ఏం చేశాడోనని చెట్లవంక చూశాను. కొమ్మలు యథాతథంగా ఉన్నాయి. శంకూ చెట్లజోలికి పోలేదన్నమాట. ప్రహరీ గోడ దగ్గరకెళ్లి చూశాను. మంగమ్మగారు ప్రహరీ గోడకి తమవైపున చికలకు కొట్టిన జామకాయలు కుప్పనీ, పక్కనే ఉన్న ఆకుల పోగునీ చూపించి, "ఇదెక్కడి న్యాయం? ఇంత అఘాయిత్యమా? ఇరుగు పొరుగులు ఇట్లా చేస్తే ఎట్లా బతుకుతాం?" అంటూ నన్ను చూడగానే గొంతు పెంచింది.

నేను కల్పించుకోక తప్పదు కాబోలు అనుకుని, ఎప్పుడూ ఆవిడతో మాట్లాడి ఎరగని నేను, మర్యాదగా "ఏమయిందండీ?" అని అడిగాను.

"నేను చెపుతాను తాతగారూ!" అంటూ ముందుకి వచ్చాడు మా శంకూ.

"చికలు కొట్టి మన ఇంట్లో పడేసిన జామకాయలు చిన్నీ, కన్న తింటే బామ్మగారు తిడతారు కదా! అందుకని వాళ్లు లేవకముందే వాటిని బామ్మగారి ఇంట్లో పడేశాను. మళ్లీ ఆకులకోసం కూడా పోట్లాడతారేమోనని అన్నీ పోగుచేసి వాళ్ల ఇంట్లో కుప్పగా పోశాను. బామ్మకి దొడ్డి అంతా ఊడిచే బాధ కూడా తప్పుతుంది కదా! అంతే తాతగారూ!"

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఆకులైనా, వాళ్ల చెట్టువి మనకెందుకు? కిందపడ్డవి తీసుకుంటే కూడా దొంగతనమే కదా! పాపం వస్తుంది కదా!" అమాయకత్వం నటిస్తూ శంకూ అన్న మాటలకి మిగిలిన వాళ్లతోపాటు మంగమ్మగారు కూడా అవాక్కయింది.

"తప్పు, శంకూ! అలా చెయ్యొచ్చా?" అంటూ నేను వాడిని లోపలికి తీసుకుళ్లిపోయాను, నా పెద్దరికం నిలబెట్టుకుంటూ. మనసులో మాత్రం శంకూ నా మనవడైనందుకు గర్వం కలిగింది.

'తాళం'పడ్డ మంగమ్మగారి నోరు అలానే ఉంటే బాగుండునన్న భావం అందరిలోనూ కలిగింది. ■

